సకల కళా కోవిదుడు

● కోలాటం గురువు, గాయకుడు, సంగీత విద్వాంసుడు నరసింహనాయుడు ● ప్రాచీన కళల ప్రాచుర్యానికి శక్తివంచన లేని కృషి



తెలుగు రత్న బిరుదును అందుకుంటున్న నరసింహనాయుడు



కోలాట బృందం.. నిర్వాహకులు



రాష్ట్ర తెలుగు భాషా, సాంస్కృతిక, పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ జాతీయ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న నాయుడు కోలాట బృందం



తబలా వాయిస్తున్న నాయుడు



తెలుగు రత్న బిరుదాకింత కార్యక్రమంలో మాట్లాడుతున్న జీయర్‌స్వామి

అగనంపూడి: ప్రాచీన కళలను బ్రతికించడమే ఆయన ఆశయం.. మరుగున పడిపోతున్న తెలుగు జానపదాన్ని జనాల్లోకి తీసుకెళ్లడమే ఆయన లక్ష్యం. ఆయన కాళ్లకు గజ్జెలు కట్టి రంగంలోకి దిగి కోలాటం చేస్తుంటే కోలాట బృందమే కాదు వీక్షకులు కూడా జత కట్టాల్సిందే, నాట్యం చేయాల్సిందే.. కీ బోర్డుపై వేలు పెడితే కళ్లు మూసుకుని పరవశించాల్సిందే. సకల కళా కోవిదునిగా, సాంప్రదాయ నృత్య కళాకారునిగా, గాయకునిగా సంగీత కళాకారునిగా, కోలాట గురువుగా ప్రసిద్ధి చెందిన తెలుగు రత్న బిరుదాంకితుడు, మహానంది, నటరాజ అవార్డుల గ్రహీత విందుల నరసింహ నాయుడు. పెదమడక నిర్వాసిత కాలనీకి చెందిన ఉక్కు ఉద్యోగి విందుల నరసింహనాయుడుకి విద్యార్థి దశ నుంచే కళలంటే మక్కువ. 8వ తరగతి చదువుకునే రోజుల్లోనే కోలాట గురువు కరక లక్ష్మణరావు వద్ద కోలాటం నేర్చుకున్నారు.

20 బృందాలకు శిక్షణ..

గాజువాక, పరవాడ, సబ్బవరం మండలాల్లోని 20 గ్రామాల్లో కోలాట బృందాలకు శిక్షణ ఇవ్వడమే కాకుండా వారిలో జోష్ నింపుతారు. నాయుడు కోలాట నృత్యంలో గురువుగా కాకుండా గాయకునిగా, డోలక్, తబల, కీబోర్డులో మంచి ప్రావీణ్యత సాధించారు. పరిసర ప్రాంతాల్లోనే కాకుండా జిల్లా నలుమూలలకు వెళ్లి ఆలయాల్లో భక్తిగీతాలు పాడుతారు.

ఆంధ్రరత్న బిరుదాంకితుడు..

2019లో త్రిదండి చినజీయర్ స్వామి సారథ్యంలో రాష్ట్ర తెలుగు భాషా, సాంస్కృతిక, పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ విజయవాడలో నిర్వహించిన జాతీయ కోలాట పోటీల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి 4 వందల బృందాలు పాల్గొని రెండు రౌండ్లలో కోలాట ప్రదర్శనలిచ్చాయి. ఈ పోటీల్లో నరసింహనాయుడు సారథ్యంలోని బృందానికి ప్రథమ బహుమతి దక్కింది. జీయర్లు పరవశించి నాయుడిని ఆంధ్రరత్న బిరుదుతో పాటు రూ.30 వేల నగదు పారితోషికం, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ ఏడాది ఉగాదిని పురస్కరించుకుని తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక మహానంది అవార్డుతో సత్కరించింది. ఈ మేడే ఉత్సవాల్లో నటరాజు అవార్డును అందించి కళారంగానికి నరసింహనాయుడు చేస్తున్న సేవలను మరోసారి గుర్తు చేసింది.

కళామతల్లి సేవలో..



కళామతల్లి సేవలో తరించే భాగ్యం నాకు దక్కింది. మరుగున పడిపోతున్న భారతీయ కళల ద్వారా ఆనందం, ఆరోగ్యం పొందొచ్చు. మానసిక సంతృప్తి సొంతం చేసుకోవచ్చు. నాకు ఉదయ్ భాస్కర్, సీహెచ్ లక్ష్మణ్, విందుల రాజు వంటి వారు సహాయ సహకారాలు అందిస్తుండడంతో కళకారునిగా గుర్తింపు వచ్చింది. – విందుల నరసింహనాయుడు, కోలాటం గురువు

క్లుప్తంగా

తిప్పలకు రాజమండ్రిలో ఘన సత్కారం



తిప్పల గురుమూర్తిరెడ్డిని సత్కరిస్తున్న రాజమండ్రి నాయకులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ రాజమండ్రి పార్లమెంటరీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డిని ఆ పార్టీ రాజమండ్రి నాయకులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతం, అనుబంధ విభాగాల పటిష్టత తదితర అంశాలపై ఆయా సంఘాల నాయకులతో గురుమూర్తిరెడ్డి గురువారం సమీక్షించారు. పార్లమెంటరీ పరిశీలకుడిగా నియమితులై తొలిసారిగా రాజమండ్రి సమావేశానికి వెళ్లిన ఆయన్ని అక్కడి నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రులు వేణు, తానేటి వనిత, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, జి.శ్రీనివాసనాయుడు, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల వివరాలపై ఆరా



సర్వేపై ఆరా తీస్తున్న జిల్లా సహిత విద్యా సమన్వయకర్త గీత

కూర్మన్నపాలెం: దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వేను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గీత గురువారం పరిశీలించారు. గాజువాక మండలంలో గత వారంలో నిర్వహించిన సర్వే ద్వారా 15 మంది పిల్లలను అధికారులు గుర్తించారు. వారి వివరాలను సమన్వయకర్త గీత అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, వారి తల్లిదండ్రులకు అర్బిజన్‌పై అవగాహన కల్పించారు. తాము గుర్తించిన పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటలు, నడక ప్రయోజనాలపై అవగాహన



విద్యార్థులకు ఆటల ప్రయోజనం వివరిస్తున్న పీడీ స్వాతి

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రతిరోజు గ్రౌండ్‌లో వివిధ ఆటలు ఆడటం, వాకింగ్ చేయడం వల్ల పొందే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలతో పాటు ఆటలు, నడక ప్రయోజనాలను జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ స్వాతి వివరించారు. అనంతరం గ్రంథాలయాధికారి బి.చంద్రకళ చిన్నారులకు కథలు చెప్పి అందులోని నీతిని వివరించారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేనేత క్లస్టర్ల ఏర్పాటుకు వినతి

గాజువాక: ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలో గురువారం నిర్వహించిన టీడీపీ మినీ మహానాడులో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతి పత్రం సమర్పించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన చేనేత శాల మాదిరిగా అన్ని జిల్లాల్లోను ఏర్పాటు చేసి చేనేతలను ఆదుకోవాలని కోరారు. చేనేత శాల పరిసర ప్రాంతాల్లో చేనేతలకు పక్కా గృహాలు ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు దాటిన చేనేతలకు పెన్షన్లు వచ్చే విధంగా చూడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో చేనేత కులాల సంఘం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు, పప్పు వెంకటేష్, ఉద్దండం గోపాలకృష్ణ, శెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

చక్రబంధంలా అండర్ పాస్ వంతెన

రోజూ తప్పని తిప్పలు



సమస్యలకు చిరునామాగా మారిన జగ్గరాజుపేట రైల్వే అండర్‌పాస్ వంతెన

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు రాజీవ్‌నగర్ కూడలి, ఫకీర్‌తక్యా మీదుగా జగ్గరాజుపేట వెళ్లే రైల్వే క్రాసింగ్ వద్ద నిర్మించిన అండర్‌పాస్ వంతెనతో ప్రయాణికులు ముప్పు తిప్పలు పడుతున్నారు. ఓ పక్క ఎన్టీపీసీ, హిందూజా రైల్వే లైన్ క్రాసింగ్ వద్ద ఇరుకు అండర్‌పాస్ వంతెన నిర్మించారు. ఈ పాస్ వంతెన వద్ద భారీ వాహనం ప్రవేశిస్తే ద్విచక్ర వాహనం కూడా నిలిచిపోవల్సిందే. ఇది చాలదన్నట్టు అధికారులు వెనువెంటనే పది మీటర్ల దూరంలోనే మరో యూ ఆకారంలోని మెయిన్ రైల్వే క్రాసింగ్ లైన్ వద్ద మరో అండర్‌పాస్ వంతెన నిర్మించారు. రెండు వంతెనల మధ్య దూరం తక్కువగా ఉండడం, కొత్తగా నిర్మించిన వంతెన ఎత్తు తక్కువగా, ఇరుగ్గా దగ్గర్లోనే మలుపు ఉండడం, లోతట్టు కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. యు ఆకారంలోని వంతెనకు ఆవల వైపు నుంచి వచ్చే వాహనాలు కనపడడం లేదు. ఒక మార్గం నుంచి వంతెనలోకి ప్రవేశిస్తే తప్పా కనపడని పరిస్థితి. ఒకేసారి రెండు ఆటోలు ప్రవేశించినా ఇబ్బంది పడాల్సిందే. అలాంటి కొన్ని సందర్భాల్లో భారీ వాహనాలు ప్రవేశిస్తుండంతో కార్లు, ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నాయి. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించడానికి కనీసం రోడ్డు మార్కింగ్‌లు, సిగ్నల్ వ్యవస్థ లేదు. ఆవల మార్గం నుంచి వచ్చే వాహనాలు కనపడేలా రెండు వైపులా అద్దాలు అమర్చినా కొంత వరకు ట్రాఫిక్ సమస్య నుంచి గట్టెక్కడానికి వీలుంటుందని ప్రయాణికులు అంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యా సంస్థలు ప్రారంభించేలోగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీరు వృథా



పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ: మండలంలో ఎక్కడికక్కడే తాగునీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్లు పగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అసలే వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం జనం ఇబ్బందులు పడుతుంటే ఈ లీకుల వల్ల మరిన్ని ఇబ్బందులు నెలకొంటున్నాయి. మండలంలోని పెదగంట్యాడ జంక్షన్ ఫైర్‌స్టేషన్ వద్ద రోడ్డు మధ్యలో పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. అలాగే అక్కడికి సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కూడా పైప్‌లైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. ప్రధాన రహదారిలో తాగునీరు ఇలా వృథా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి చర్యలు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వినాయకుడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక నిర్వాసిత కాలనీలోని సుబ్రహ్మణ్య అయ్యప్ప సహిత సంపత్ వినాయక ఆలయం 26వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదమడక, అట్టవానిపాలెం, కొండయ్యవలస, అండమాన్ కొండయ్యవలస, బీసీ కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అభిషేకాలు, పూజలు చేశారు. స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, నవగ్రహ మండపారాధన, లక్ష్మీ గణపతి హోమం తర్వాత ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

గాజువాక: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గాజువాక జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ 2016 నుంచి 2018 వరకు కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఇన్‌కం ట్యాక్స్ సొమ్ము వెనక్కి వచ్చినప్పటికీ చాలా మంది కార్మికులకు జమ చేయలేదన్నారు. 2022 నుంచి పని చేస్తున్న ఆప్కాస్ కార్మికుల మిస్సింగ్ జీతాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆప్కాస్‌లో పని చేస్తున్న కార్మికులు తెల్ల రేషన్ కార్డుకు దరఖాస్తు చేస్తే ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, ఎ.నూకేశ్వరరావు, గొల్ల రాము, బంగారు నాయుడు, నాగరాజు, గణేష్, కె.వి.రమణ, మీనాక్షి, సత్యవతి, పద్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామదూతం శిరసా నమామి



దయాల్‌నగర్‌లో భక్తాంజనేయ స్వామికి వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు



గంగవరంలో అభయాంజనేయస్వామి వారిని దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు



79వ వార్డు అగనంపూడి జాబిలీ హిల్స్‌లో హనుమాన్ చాలీసా జపిస్తున్న భక్తులు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న చందు తదితరులు



85వ వార్డు గెంజిపేటలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమంతునికి పూజలు చేస్తున్న భక్తులు



కణితి కాలనీలో పూజలు చేస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు



షీలానగర్‌లో అభయాంజనేయుని దర్శించుకుంటున్న భక్తులు

● ఘనంగా హనుమజ్జయంతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని గంగవరంలో అంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త తిప్పల దేవన్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 74వ వార్డు దయాల్‌నగర్ బీసీ రోడ్డులోని భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో ఆలయ అర్చకుడు సీతాపతి శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, సింధూర సహిత నాగవల్లీ దళార్చన నిర్వహించారు. 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వేంచేసిన ఆంజనేయస్వామికి బీజేపీ నాయకులు జిలకర్ర భువనేశ్వరీ, జిలకర్ర రమణ ప్రత్యేక పూజలు చేశారు. నడుపూరులోని హనుమాన్ మందిరంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జీవీఎంపీ 76వ వార్డు పరిధిలోని నడుపూరులో గల అభయ ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి..

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతి భక్తిశ్రద్ధలతో జరిపించారు. 79వ వార్డు అగనంపూడి జాబిలీ హిల్స్‌లోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని అభయాంజనేయస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మూర్తి, మణి, వెంకటరావు, అచ్యుతరావు, రమణ, జయ, శ్రీదేవి, జ్యోతి, సరస్వతి పాల్గొన్నారు.

గెంజిపేటలో..

85వ వార్డు లంకెలపాలెంలోని గెంజిపేట అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గెంజి సురేష్, బాబ్జి, రమణ కుటుంబ సభ్యులు వారి పూర్వీకులు గెంజి పైడితల్లి, సింహాచలం జ్ఞాపకార్థం విశేష అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు, కాతా నూకేష్, గెంజి అప్పలరాజు, నాగేశ్వరరావు, సంతోష్, కడిమి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ జగ్గరాజుపేటలో..

కూర్మన్నపాలెం: యాదవ జగ్గరాజుపేట అభయ అంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 88వ వార్డు నాయకులు దాడి నూకరాజు, పల్లా చినతల్లి, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కణితి కాలనీలో...

కణితి కాళింగవీధిలో అభయ గణపతి సాయినాథ్ సహిత అభయ కోదండ రామాలయంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించి నిమ్మకాయ దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రగడ శ్రీనివాసరావు, దానప్పలు, వెంకటసూరి, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, లీలాప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..

అక్కిరెడ్డిపాలెం: గురువారం జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. 68వ వార్డు భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ ప్రసన్న గిరి కొండపై వేంచేసిన దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం వివేకానందకాలనీలోని శ్రీ పర్వతాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. నాతయ్యపాలెంలోని శ్రీ బంగారు మాంబ, సంపత్ వినాయక, శ్రీ కాశీవిశ్వేర, శ్రీ షిర్డీ సాయిబాబా, శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిందిలో అంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..

ఉక్కునగరం: ఉక్కు స్టేడియం ఎదురుగా ఉన్న హనుమాన్ ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..

సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు ఏకాహం భజనలు చేశారు. కార్యక్రంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీలో..

గాజువాక: హనుమజ్జయంతి సందర్భంగా 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలోని ఆలయంలో వార్డు కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నీలాతి అచ్చిబాబు, బాబులునాయుడు, సత్యం, వేపాడ శ్రీను, శరగడం రవికుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు పరిశుభ్రం

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారును 92వ వార్డు శానిటరీ సిబ్బంది గురువారం ప్రత్యేక డ్రైవ్‌గా శుభ్రం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలుల వల్ల రైతుబజారులో చెత్త పేరుకు పోయింది. దీంతో రైతు బజారులోకి రాకపోకలు సాగించేందుకు కూడా వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో బయట, లోపల శానిటరీ సిబ్బంది శుభ్రం చేశారు. దీంతో రైతుబజార్ సిబ్బంది, రైతులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.